విద్యార్థులకు కంప్యూటర్ పట్ల అవగాహన

విశాలాంధ్ర - పాయకరావుపేట: వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు కంప్యూటర్ పట్ల అవగాహన కలిగించారు. అలాగే పుస్తక పఠనం, కథలు చెప్పడం, ఇంగ్లీష్, హిందీ పదాలు చదవడం, రాయడం నేర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్.టి. సీతారామమూర్తి, ఎస్.సీతారామయ్య, గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జూన్ 4న అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు పూర్తి సహాయ సహకారాలను అందించాలని జిల్లా కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్ శెట్టి కోరారు. గురువారం కలెక్టరు కార్యాలయంలో అనకాపల్లి పార్లమెంటు, జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజక వర్గాలలో పోటీలో వున్న అభ్యర్థులు, వారి ఏజెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కె.వి.మురళీ కృష్ణతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గల అన్ని నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఫ్యూచర్ వరల్డ్ స్కూల్‌లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పార్లమెంటు నియోజకవర్గంలో భాగమైన పెందుర్తి నియోజకవర్గం ఓట్ల లెక్కింపు విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో జరుగుతుం దన్నారు. కౌంటింగ్ హాల్‌లోకి ప్రవేశం, అసెంబ్లీ, పార్లమెంట్ టేబుళ్ల అమరిక మొదలైనవి అభ్యర్థులు, ఏజెంట్లు ముందుగా పరిశీలించుకోవచ్చని తెలి పారు. నిర్ణీత సమయాల్లో వారు వచ్చి ఏర్పాట్లను, రాకపోకలను గుర్చి తెలుసుకోవచ్చని చెప్పారు. కౌంటింగ్‌కు హాజరయ్యే ఏజెంట్లు తప్పనిసరిగా పాస్‌లు తీసుకోవాలన్నారు. సెల్ ఫోన్ లను కేంద్రంలోనికి తీసుకు వెళ్లరాదని కనుక తమ సెల్ ఫోన్ లు తీసుకురావద్దని చెప్పారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధిత ఆర్వోలు, ఎంపీ నియోజకవర్గానికి డి.ఆర్.ఓ. పాస్‌లు మంజూరు చేస్తారని చెప్పారు. పోలీసు సూపరి టెండెంట్ కె.వి.మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, అందరూ సంయమనం పాటించి నందుకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా కౌంటింగ్ ప్రక్రియ కూడా ప్రశాంతంగా జరిగేందుకు అన్ని పార్టీల వారు సహకరించాలన్నారు. ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి సహృద్భావ వాతావరణంలో ఎటువంటి ఘర్షణ లకు, హింసకు తావివ్వకుండా ఇతరుల భావోద్వేగాలను ప్రేరే పించకుండా చట్టాలను గౌరవిస్తూ, నిబంధనకు కట్టుబడి జిల్లాలో మొత్తం ఎన్నికల ప్రక్రియ శాంతియుతంగా జరగాలన్నారు. 1వ తేదీ నుండి టీవీలలో ఎగ్జిట్ పోల్స్ ప్రసారమవుతాయని, ఆరోజు నుండి శాంతి భద్రతల పర్యవేక్షణకు ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించడం జరుగుతుం దన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద త్రీ టైర్ భద్రత వుంటుందని, మొబైల్ ఫోన్‌లు ఎవరివీ అనుమతించబడవని చెప్పారు. కౌంటింగ్ హాలులో క్రమశిక్షణతో ఉండాలన్నారు. పికెట్లు, చెక్ పోస్టులు మరింత కట్టుదిట్టం చేస్తామని చెప్పారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, ఆర్డీవోలు ఎ.చిన్నికృష్ణ, హెచ్.వి.జయరామ్, ఆర్.వోలు మనోరమ, గీతాంజలి, సత్యవాణి, అనకాపల్లి పార్లమెంటు, జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు, వారి ఏజెంట్లు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు

విశాలాంధ్ర - కశింకోట: అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పాత్రపల్లి వీరు యాదవ్ అన్నారు. ఉడ్ పేటలో గల విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో సంఘ వ్యవ స్థాపకులు పాత్రపల్లి వీరు యాదవ్ మాట్లాడుతూ అనకాపల్లిలో అప్రకటిత విద్యుత్ కోతలతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసలే ఎండా కాలం కావడంతో రోజు రోజుకీ ఉష్ణోగ్రతలు పెరిగిపోయి 38, 40 డిగ్రీల కొనసాగుతున్నాయని, ప్రజలు ఈ వేడికి తట్టుకోలేక ఎన్ని పనులు ఉన్నా రోడ్లపై రాకుండా ఇంటిపట్టునే ఉంటుంటే ఈ క్రమంలో విద్యుత్ కోతలు విధించడం సరికాదన్నారు. పారిశుద్ధ్యంలో అట్టడుగున ఉండే అనకాపల్లి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఇంకా దారుణంగా తయారైందని, ఎక్కడ చెత్త అక్కడే ఉంటుందని, ఏ కాలువలు కూడా శుభ్రం చేసే పరిస్థితులు లేక పట్టణంలో తీవ్రంగా దోమలు పెరిగిపోయి పట్టణ ప్రజలు ప్రతిక్షణం బాధలు పడుతున్నారన్నారు. ఎటువంటి ప్రకటన లేకుండా పగలు, రాత్రి తేడా లేకుండా విద్యుత్ కోతలకు పాల్పడుతున్నారని, రాత్రిళ్ళు మరీ దారు ణంగా గంటలు, గంటలు కరెంటు తీసివేయడంతో వేడికి ఉండలేక ఇంటా, బయట దోమలతో పసిపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడేవారు పట్టణ ప్రజలు అందరూ ఎంతో నరకాన్ని అనుభవిస్తున్నారన్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని విద్యుత్ కోతలు తలెత్తకుండా మరి ముఖ్యంగా రాత్రిళ్ళు విద్యుత్ కోత విధించ కుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో కోరుకొండ నాగరాజు, ముక్కా గణేష్, కరణం శివ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - కె.కోటపాడు: స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో గురువారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి విశాఖపట్నం, వాసవి క్లబ్ సంయుక్తంగా ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 85 మంది కంటి రోగులకు పరీక్షలు చేయగా 35 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. కంటి నరాలు చికిత్స కోసం, కంటి పై పొర చికిత్స, కంటి నీటి కాసులు, కంటి రెప్పలు, చిన్నపిల్లల కంటి చికిత్సకు ఈ శిబిరం నుండి శంకర్ ఫౌండేషన్‌కు రిఫర్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సంస్థ అధ్యక్షులు విన్నకోట ఆనంద రావు, కార్యదర్శి కోట్ల రాంబాబు, కోశాధికారి మామిడి రమణాజీ, శంకర్ ఫౌండేషన్ డాక్టర్ మధులిక, ఆప్తలమిక్ ఆఫీసర్ హరి చందన, క్యాంపు కో ఆర్డినేటర్ సిహెచ్ అశ్వని కుమార్, నర్సింగ్ స్టాఫ్ దీపిక పాల్గొన్నారు.

అల్లూరి పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం తగదు

సీతమ్మ కొండపైకి రోడ్డు వేయాలి

జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల

విశాలాంధ్ర - పాయకరావుపేట: స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు చరిత్రలో ప్రధానమైన నాలుగు సంవత్సరాల పాటు తపస్సు చేసిన పాయకరావుపేట మండలం, గోపాలపట్నంలో సీతమ్మ కొండపై ఉన్న శ్రీ ఉమా ధర్మ లింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు ఆరోపించారు. జాతీయ అల్లూరి యువజన సంఘం ప్రతినిధుల బృందంతో ఆయన గోపాలపట్నంలోని సీతమ్మ కొండపై ఉన్న శ్రీ ఉమా ధర్మ లింగేశ్వరస్వామి ఆలయ సముదాయాన్ని, చుట్టూ ఉన్న ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పడాల వీరభద్రరావు మాట్లాడుతూ గతంలో మంత్రిగా ఉన్న గుడివాడ అమర్నాథ్ మొక్కు తీర్చుకోడానికి ఒకసారి, శంకుస్థాపన నిమిత్తం మరోసారి వచ్చి హడావుడి చేశారు గాని ఒక్క రూపాయి నిధులు కూడా విడుదల చేయలేదని, ఆయన వచ్చిన సందర్భంగా రెండు పర్యాయాలు స్థానికులు అన్న దానాలు చేయడం వల్ల రూ.60 వేలు ఖర్చు చేయడం జరిగిం దన్నారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన దేవాలయానికి రోడ్డు మార్గం లేక పర్యాటకులు, భక్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డు మార్గం పడినట్లయితే జనం తాకిడి పెరిగి దేవాలయానికి ఆదాయ వనరులు పెరిగినట్లయితే స్థానికులే దేవాలయాన్ని అభివృద్ధి చేసుకోగలరని అన్నారు. దేవాలయం అభివృద్ధి చెందినట్లయితే భక్తుల, పర్యాటకుల తాకిడితో చుట్టూ ఉన్న గ్రామాలు కూడా సందడిగా మారి అభివృద్ధికి కొంత దోహదపడుతుందన్నారు. డెక్కన్ కెమికల్స్ యాజమాన్యం రోడ్డు నిర్మాణానికి ముందుకు వచ్చినట్లు తెలిసిందని, వారైనా చొరవ చూపి రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో ఏర్పడే నూతన ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి దోహదపడాలని పడాల వీరభద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఉపాధ్యక్షురాలు వాడపల్లి వెంకట రమణమ్మ, కార్యదర్శి లక్కాకుల బాబ్జి, ఉత్తమ ఉపాధ్యాయుడు జై బాబు, శివాజీ రాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక క్షేత్రంగా బొజ్జన్న కొండ

- ఎంపీ భీశెట్టి సత్యవతి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక క్షేత్రంగా బొజ్జన్న కొండ రూపుదిద్దుకోబోతుందని ఎంపీ బిశెట్టి సత్యవతి అన్నారు. సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 2568వ బుద్ధ జయంతి (బుద్ధ పూర్ణిమ) వేడుకల్లో భాగంగా బొజ్జన్న కొండ చరిత్ర, విశిష్టతపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంపీ సత్యవతి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ముందుగా ఆమె బుద్ధుని చిత్ర పటానికి పూలమాల వేసి బౌద్ధ పూజలు చేశారు. అనంతరం వ్యాసరచన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బుద్ధుని మెడల్స్ గిఫ్ట్ లను అందజేసి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భగవాన్ బుద్ధుడు ప్రపంచానికి మొట్ట మొదటిగా అహింస, శాంతి, ధర్మ మార్గాలను ప్రభోదించిన గొప్ప మహనీయుడని అటువంటి మహనీయుని జయంతిని ఈనాడు ప్రపంచ వ్యాప్తంగా బుద్ధ పూర్ణిమ పర్వ దినముగా ఆరాధించి పూజలు చేసుకోవడం గొప్ప విషయం అని అన్నారు. అలాగే బుద్ధుని శాంతి మార్గమే ప్రపంచ శాంతికి మార్గ దర్శకమని అన్నారు. అలాగే మన ప్రాంతంలో గల ప్రముఖ బౌద్ధ పర్యాటక క్షేత్రం అభివృద్ధి పనులు అతి త్వరలో పూర్తి స్థాయిలో అయి అనకాపల్లి కేంద్రంగా ఈ బొజ్జన్న కొండ అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి గాంచి విరాజిల్లుతుందని అన్నారు. కె.విష్ణుమూర్తి మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు తన జీవితం సర్వస్వాన్ని పరుల మేలుకొరకు త్యజించిన గొప్ప సంఘ సంస్కర్త, గొప్ప దార్శనికుడని ప్రతీ ఒక్కరూ బుద్ధుని అహింసా మార్గంలో నడుచుకొని ప్రపంచ శాంతికి దోహద పడాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో సిద్ధార్థ సోషల్ సర్వీస్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం, కార్యదర్శి వినకోట నీలేశ్ గుప్తా, ఉపాధ్యక్షులు పట్నాల కృష్ణ మోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కొత్తూర్తి రామారావు, బొడ్డు సోమరాజు, కాపారపు సత్యనారాయణ, తెలుగు ప్రొఫెసర్ శ్రీమతి అల్లాడ సౌజన్య కుమారి పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు నిబద్దతతో, నిర్భయంగా చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జూన్ 4వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపు నిబద్దతతో, నిర్భయంగా చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి ఆదేశించారు. గురువారం కలెక్టరు కార్యాలయంలో మాస్టర్ ట్రయినీలకు ఈవీఎంలు, పోస్టల్ బ్యాలట్ లెక్కింపుపై నిర్వ హించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శిక్షణలో ప్రతి చిన్న విషయాన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. మాన్యువల్‌లో సూచించిన ప్రకారం ఓటు చెల్లుబాటును గుర్తించ వలసి వుంటుందన్నారు. ముందుగా ఈవీయం ను పరిశీలించి పోలయిన ఓట్లను సరిచూడాలన్నారు. తరువాత సాంకేతిక పరమైన అంశాలను సరిచూసి ఆపై లెక్కింపుకు వెళ్లాలన్నారు. ఎటువంటి తడబాటుకు అవకాశమీ యరాద న్నారు. పోస్టల్ బ్యాలట్ లెక్కింపు, ఈవీఎంల లెక్కింపు పైన కూడా అందరికీ పూర్తి శిక్షణ ఇవ్వాలన్నారు. శిక్షకులు చెప్పిన విషయాలను క్షుణ్ణంగా ఆకలింపు చేసుకోవాలన్నారు. చిన్న పొరపాటుకు కూడా అవకాశమి య్యరాదన్నారు. నియమ నిబంధనలను పూర్తిగా అర్థం చేసుకోవాలన్నారు. ప్రశాంత చిత్తంతో వున్నట్లయితే ఎటువంటి పొరపాటు జరుగదని చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, సిపిఓ జి.రామారావు, నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి.జయరామ్, సివిల్ సప్లైస్ డి.యం. పి.జయంతి, డిఎల్.డి.ఓ. నాగలక్ష్మి, డి.ఎల్.పి.వో. కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ డి.రామమూర్తి, డిటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

విశాలాంధ్ర - యలమంచిలి: మండలంలోని రైతు భరోసా కేంద్రములలో పచ్చి రొట్ట విత్తనములు 100 క్వింటాల్ అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పొలిమేర మోహనరావు తెలిపారు. 50% రాయితీ మీద విత్తనములు వినియోగించుకోవాలని మండలంలోని ప్రతి రైతు భరోసా కేంద్రములో వివరములు నమోదు చేసి భూమి పాసు బుక్, ఆధార్ నంబర్ తీసుకొని వచ్చి వినియోగించుకోవాలని అన్నారు. అలాగే రైతులకు వరి విత్తనములు కూడా అందరికీ అందుబాటులో ఉంటాయని ఆర్.జి.ఎల్ 2537తో పాటుగా కొత్త రకం విత్తనములు ఎంటియు 1318, ఎంటియు -1061, 1064, 1224, 7026 విత్తనములు సబ్సిడీ మీద రైతు భరోసా కేంద్రములో ఉంటాయని, అలాగే కొర్ర, సామ, గంటి విత్తనములు కెవికె కొండెంపూడి వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మండలంలో సుమారు వరి సాగు 4000 ఏకరాలు ఉండొచ్చు అని ఈ సంవత్సరం మంచి వర్షాలు కూడా ఉంటాయని అన్నారు.

పచ్చి రొట్టె విత్తనాలతో మరిన్ని ఉపయోగాలు

భూమి సారవంతంగా ఉండి ఎక్కువ దిగుబడి రావడానికి అవకాశం ఉంటుంది అని, ఎరువులు వేసే అవసరం తగ్గుతుంది అని ముఖ్యంగా యూరియా ఎరువు, పురుగుల మరియు తెగుళ్ల ఉధృతి ఉండదు అని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులతో సమావేశం

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో కే.స్వప్న, ఈవోపీఆర్డీ చంద్రశేఖర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు సరఫరా చేసే ట్యాంకులు శుభ్రపరచడం, చెత్త నుండి సంప్రదాయ కేంద్రాలు వినియో గంలోకి తీసుకురావడం తదితర చర్చించారు. వీటికి సంబంధించి కార్యదర్శులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, వై. సత్యనారాయణ, బి.ఏ.బి.ఎల్. మూర్తి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు లేని 66 వాహనాలు స్వాధీనం



విశాలాంధ్ర - పాయక రావుపేట: అనకాపల్లి జిల్లా ఎస్పీ కెవి మురళీకృష్ణ ఆదేశాల మేరకు నర్సీపట్నం డి.ఎస్.పి. జి.ఆర్.ఆర్ మోహన్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు కాలనీలలో తనిఖీలు నిర్వహించి ఎటువంటి రికార్డులు లేని 66 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వి.అప్పలరాజు తెలిపారు. వాహన యజమానులు వాహనాలకు సంబంధించిన రికార్డులు తెచ్చి చూపించిన పక్షంలో వాహనాలు అప్పగిస్తామని తెలిపారు. ఈనెల 13న జరిగిన ఎన్నికలకు సంబంధించి వచ్చేనెల 4వ తేదీన కౌంటింగ్ ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వైభవంగా పైడితల్లి అమ్మవారి జాతర

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో ఉప్పారాపల్లి గ్రామంలో పైడితల్లి అమ్మవారి జాతర వైభవంగా జరిగింది. గురువారం ఉదయం నుండి భక్తులు అమ్మవారి ఆలయానికి వచ్చి తమ మొక్కలను తీర్చుకున్నారు. భారీ విద్యుత్ అలంకరణ, బాణాసంచాను ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు చలివేంద్రాలను ఏర్పాటు చేసి మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి నేను సైతం

విశాలాంధ్ర - చోడవరం: మనిషి జీవితంలో చివరి మజిలీ శ్మశాన వాటిక అభివృద్ధికి నేను సైతం అంటూ సీపీఐ అనకాపల్లి జిల్లా సమితి సభ్యుడు, ఏ.పి.రైతు సంఘం ఉపాధ్యక్షుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో చోడవరం శ్మశాన వాటిక గోడకి పెయింటింగ్ వేయిస్తున్నారు. చోడవరం నుండి అంకుపాలెం వెళ్లే దారిలో ఉన్న శ్మశానం అభివృద్ధికి సీపీఐ చోడవరం ఆధ్వర్యంలో దాతలు ఇచ్చిన విరాళాలు, సొంత నిధులతో అభి వృద్ధి చేస్తున్నామని వారు తెలియజేసారు. సి.పి.ఐ. అనకాపల్లి జిల్లా కార్మికుల సభ్యుడు రెడ్డిపల్లి ఆధ్వర్యంలో చోడవరం శ్మశాన ప్రహరీకి పెయింటింగ్ వేయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నేమాల నరసింగరావు, ద్వారపూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

విశాలాంధ్ర - యస్.రాయవరం: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులను చేర్పించాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులను అభ్యర్థించారు. గురువారం మండలంలో దార్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమణ శ్రీ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి ఇంటికి ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నాలుగు సదుపాయాలు వంటివి ఉన్నాయని విద్యార్థులు కావలసిన బోధనా సిబ్బంది అందుబాటులో ఉన్నారన్నారు. ప్రైవేట్ పాఠశాలలో చేర్పించడం వల్ల ఆర్థికంగా ఇబ్బంది ఉంటుందని ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రాహ్మణి ముత్యాలమ్మ తల్లి పండగ

విశాలాంధ్ర - పరవాడ: మండల కేంద్రం పరవాడలో శ్రీ బ్రాహ్మణి ముత్యాలమ్మ తల్లి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవారిని దర్శిం చుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి తదితరులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం వద్ద భక్తుల సౌక ర్యార్థం కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తాగునీరు, ప్రసాదం పంపిణీ చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, స్థానిక నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైల రామచంద్రరావు, పైల చినక్కునాయుడు, గండి ఈశ్వరరావు, గండి మహేష్, బండారు రాజు, పైల కృష్ణ, పైల బుజ్జి, చీపురుపల్లి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎం.కోడూరు శ్రీదుర్గాలమ్మ పండగ

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం ఎం.కోడూరు గ్రామంలో గురువారం గ్రామానికి చెందిన కోల రాము ఆధ్వర్యంలో దుర్గాల అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. సుమారు 50 ఘటాలను తలపై ధరించి శ్రీ దుర్గా అమ్మవారి ప్రతిమను గ్రామంలో ఊరేగించి అనంతరం ఆలయానికి చేరుకొని అమ్మవారికి తమ మొక్కలను ముడు పులను చెల్లించుకున్నారు. ఆలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమాన్ని చేపట్టారు ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు

విశాలాంధ్ర - అచ్యుతాపురం: విద్యార్థులలో సృజనా త్మకతను వెలికి తీసేందుకు చిత్రలేఖనం పోటీలు దోహదం చేస్తాయని గ్రంథాలయాధికారి డి.కోటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో అనేక కార్యక్రమాలు ఉపాధ్యాయులు సమక్షంలో నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అచ్యుత స్కూల్ ఉపాధ్యాయిని మాధవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్ర అమ్మవారి సారె ఊరేగింపు

విశాలాంధ్ర - యలమంచిలి: పట్టణంలో వెలసి ఉన్న శ్రీ రామచంద్రమ్మ పండగ ఈనెల 30వ తేదీ జరగనుందని ఉత్సవ కమిటీ వారు ఒక ప్రకటనలో తెలిపారు. పండగ సందర్భంగా గురువారం అమ్మవారి సారె ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని అమ్మవారికి పిండి వంటలు ఇంటి వద్ద తయారుచేసి సారె ఊరేగింపులో పాల్గొన్నారు. అమ్మవారి ఆలయం నుంచి ధర్మవరం, కాకివాని వీధి, శతకం పట్టు, తులసీ నగర్, పాతవీధి, రామచంద్రపురం కాలనీ మీదగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు, భక్తులు పాల్గొని అమ్మవారి సారె ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - యలమంచిలి: 33/11 కెవి యలమంచిలి సబ్ స్టేషన్ పరిధిలో గల 11కెవి రాంబిల్లి రూరల్ ఫీడర్ లైన్ నిర్వహణ (ఆర్.డి.ఎస్.ఎస్) పనులు నిమిత్తం శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం, యలమంచిలి వ్యవసాయ కనెక్షన్‌లు, యర్రవరం వ్యవసాయ కనెక్షన్‌లు, కొత్తపాలెం వ్యవసాయ కనెక్షన్‌లు ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ ఈ ఈ కె.రాజశేఖర్ అన్నారు. అలాగే వ్యవసాయ పంపులకు విద్యుత్ సరఫరా ఉండదని దీనికి ప్రత్యామ్నాయంగా ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా చేయను న్నామని రైతులు గమనించి సహకరించాలని తెలిపారు.

బాణాసంచాపై నిషేధం

విశాలాంధ్ర - గొలుగొండ: సార్వత్రిక ఎన్నికలు ఫలితాలు వెలువడించే నేపథ్యంలో జూన్ 4వ తేదీన ఎటువంటి ర్యాలీలకు ఊరేగింపులకు అనుమతులు లేవని ఎస్సై కృష్ణారావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బాణసంచా విక్రయాలపై ఎన్నికల కమిషన్ నిషేధం విధించిందని ఎవరైనా ఆంక్షలు ఉల్లంఘిస్తే అలాంటి వ్యక్తులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అదేవిధంగా ఎటువంటి ర్యాలీలకు, సభలకు అనుమతులు లేవని రాష్ట్రవ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉన్నందున నలుగురు వ్యక్తులు మించి గుమ్మిగూడి ఉండరాదని ఈ సందర్భంగా ఎస్సై కృష్ణారావు తెలియజేశారు.